# మూసిన తలుపు

సాయంత్రం ఆరుగంటలైంది. ఏ నిమిషాన్నైనా కలక్టరుగారు రావచ్చు. ఆ రోజునుంచి ఆరోగ్యవారం ప్రారంభం. మంచి ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. రోజూ సాయంత్రం ఉపన్యాసాలు, వినోద కార్యక్రమాలు ! వారంరోజులు ఉత్సవం బ్రహ్మాండంగా జరుగుతుంది. ఆ వేళ సాయంత్రం అయిదు గంటలనుంచే అంతా ప్రదర్శన చూస్తున్నారు. ఆవరణ అంతా చుట్టి తిరుగుతున్నారు. కాని ఆరుగంటలకే ప్రారంభోత్సవం ! కలక్టరుగారు వచ్చి లాంఛనప్రాయంగా రిబ్బను కత్తిరించాలి. తరువాతే సభ ప్రారంభమౌతుంది. టైమైంది. ఆయన ఏ నిమిషాన్నైనా రావచ్చు! అందుకే హెల్తాఫీసర్ రామనాథంగారు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు. అందరికీ ఆరోగ్యాన్ని బోధించటానికికదా మరి ఈ ప్రదర్శనలు, ఉత్సవాలు ! అందుకని ప్రవేశం అందరికీ ఉచితమే! అయినా మరీ హద్దులేకుండా అడ్డమైన వాళ్ళనందరినీ లోపలికి వదిలితే మరీ గందరగోళంగా ఉంటుంది కదా! అందుకని గేటు దగ్గర ఇద్దరు కాపలావాళ్ళు ఉన్నారు. అందరినీ లోపలికి పోనివ్వటం లేదు. కాస్త శుచిగా శుభ్రంగా ఉన్నవాళ్ళను, ఉద్యోగస్థులను మాత్రమే వదులుతున్నారు. పక్క ఆవరణలో గుడిసెల్లో పిల్లలు గేటుదగ్గర గుంపుగా ఉన్నారు. అక్కడ లోపల ఏదో మహాఅద్భుతం జరుగుతోంది. అది చూడాలన్న తపన వాళ్ళముఖాల్లో చిందులాడుతోంది. అక్కడే ఉంటే కొంతకు కొంతైనా లోపల జరిగేది కనపడుతుంది. ఆశతో అట్లాగే గేటు పట్టుకు వేళ్ళాడుతున్నారు. అది రామనాథంగారికి చికాకుగా ఉంది. కాపలావాళ్ళమీద అరిచారు. "ఆ పిల్లలను అవతలకు పంపించు. కలక్టరుగారు వచ్చే వేళయింది." కాపలావాడు ఒక్క

అరుపు అరిచాడు. పిల్లలు కాస్త వెనక్కి తగ్గారు. మళ్ళా ముందుకు మూగారు. అంతలో కలక్టరు రావుగారి జీప్ వచ్చి ఆగింది. ఆయన అందులోనించి దిగారు. రామనాథంగారు ఎదురు వెళ్ళారు. చుట్టూ జనం మూగారు.

రావుగారు గేటు దగ్గర నిల్చుని ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటున్న పిల్లలను చూస్తూ లోపలకు వెళ్ళారు. వాళ్ళ ముఖాల్లోని ఆత్రుతా, దీనత్వమూ ఆయన దృష్టిని ఆకర్షించాయి. లాంఛనప్రాయంగా రిబ్బను కత్తిరించటమైంది. పక్కన చిన్నగదిలో కొందరికి మాత్రం అల్పాహార విందు ఏర్పాటు చేయబడింది. పెద్దలందరూ అక్కడికి వెళ్ళి కూర్చున్నారు. రావుగారు పరధ్యానంగా ఉన్నారు. చేతిలో బిస్కటు తినకుండా ఊరికే తిప్పుతూ ఆడుకుంటున్నారు. గేటు దగ్గర చూసిన దృశ్యం ఇంకా ఆయన మనసులో మెదులుతోంది. అమాయకమైన పిల్లల ముఖాలు గుర్తుకు వస్తున్నాయి. ముఖ్యంగా ముందర వరుసలో ఓ ఐదేళ్ళ కుర్రాడు, చిరిగిన లాగుతో మాసిన చొక్కాతో అమాయకంగా బిత్తరపోయి చూస్తున్నాడు. వాడి ముఖం మళ్ళా మళ్ళా గుర్తువస్తోంది. పాపం వాడికి ఎంతగా లోపలికి వెళ్ళి వినోద ప్రదర్శనలు చూడాలని ఉంటుందో! అలా వెళ్ళలేక, ఎంత బాధగా నిస్పృహగా ఉంటుందో!

ఆయనకు తన చిన్నతనం గుర్తువచ్చింది. తను పెరిగింది పల్లెకాదు. పెద్ద పట్టణమూ కాదు. తనకు తండ్రి చిన్నతనంలోనే పోయాడు. ఎక్కువ ఆస్తి ఏమీ లేదు. ఏదో ఒక చిన్న ఇల్లు, కాస్త పొలము ఉన్నాయి. తల్లి ఒంటరిది. వారి బంధువులు, స్నేహితులు స్థితిమంతులు కావి, హోదాలో ఉన్నవాళ్ళుకాని ఎవళ్ళూ లేరు. ఉన్నదాంట్లోనే అమ్మ జాగ్రత్తగా సంసారం గడుపుతూ తనను చదివించేది. అమ్మ ఎప్పుడూ ఇల్లు వదిలి బయటికి వచ్చేదికాదు. ఏ గొప్పవాళ్ళతోను ఆమెకు పరిచయం లేదు. స్కూల్లో

ఎప్పుడూ డబ్బున్నవాళ్ళ పిల్లలు, ఉద్యోగస్థుల బిడ్డలూ ముందు బెంచీలలో కూర్చునేవాళ్ళు. తనకు ఎప్పుడూ వెనక బెంచీయే! స్కూల్లో అన్ని పనులు తనే! టీచర్లు అన్ని పనులు తనకే పురమాయించేవాళ్ళు. ఇంచుమించు నౌకర్లా కుర్చీలు వెయ్యటము, బల్లలు సర్దటము, మంచినీళ్ళు తేవటము, ఏవో చేస్తూ ఉంటేవాడు. తక్కిన పిల్లలకున్న గౌరవం తనకు లేదని మనసులో చింతగా ఉండేది. పిల్లలంతా ఎప్పుడూ మంచి బట్టలు వేసుకుంటే, తనకెప్పుడూ చినిగిన బట్టలూ, మాసిన బట్టలూ ఉండేవి. అయినా చాలా కష్టపడి చదివి క్లాసులో అందరికన్నా ఎప్పుడూ మంచి మార్కులు తెచ్చుకునేవాడు. ఎప్పుడూ ఫస్ట్‌రాంక్‌లోనే ఉండేవాడు. ఆ విధంగా ఊరట పొంది, మనసులో బాధ పోగొట్టుకునేవాడు.

అప్పుడు తన ఊళ్ళో ప్రతి సంవత్సరమూ ఆరోగ్యవారాలు జరిగేవి. ఆ వారంరోజులు అదేదో తిరనాళ్ళలాగా ఉండేది. అందరూ సాయంత్రం కాగానే చక్కగా తయారై అక్కడకు వెళ్ళి కాసేపు సరదాగా తిరిగి నాటకాలు, డాన్సులూ అవీ చూసి ఇళ్ళకు వచ్చేవాళ్లు. తన సహాధ్యాయులంతా రోజూ అక్కడే ఉండేవాళ్ళు. తనూ రోజూ వెళ్ళేవాడు. కాని ఒక్కనాడూ, ఒక్క సంవత్సరమూ తనకు లోపలకు ప్రవేశం దొరకలేదు. ప్రతిసారి తన చినిగిన లాగు, మాసిన చొక్కాతో తోడులేకుండా ఒంటరిగా రావడం చూసి, కావలావాడు ఎప్పుడూ గదమాయించి గేటుదగ్గరే ఆపేసేవాడు. ఆశ చంపుకోలేక, వెళ్ళిపోలేక దిక్కుమొహం వేసుకొని తనుఎంతోసేపు అలానే గేటుదగ్గరే ఉండిపోయేవాడు. తన తోటి పిల్లలంతా ఉద్యోగస్థులైన తండ్రులతో ఎంతో గౌరవంగా, సరదాగా లోపలకు వెళ్లుతుండేవారు. వాళ్ళని చూడగానే కాపలావాడు భయంగా పక్కకు తప్పుకుంటూ ఉండేవాడు. తనకి ఎంతో అవమానంగా బాధగా వుండి ఒక్కొక్కసారి కళ్ళవెంట నీళ్ళు వచ్చేవి.

ఒకసారి బలవంతంచేసి తన తల్లిని తీసుకువచ్చాడు. ఆ వేళ తనకు ఎంతో పట్టలేని సంతోషంగా వుంది. అమ్మ ఇల్లు కదలి తనతో రావడం తనకెంతో సంతోషంగా ఉంది. ఏదో పెద్ద గవర్నరు తనతో వచ్చినంత గౌరవంగా గర్వంగా ఉంది. ఇహ ఇవ్వాళ కాపలావాడు ఏమీ అనడు అని

పించింది. గేటుదగ్గర కాపలావాడిని చూసి గర్వంగా సంతోషంగా అన్నాడు- "మా అమ్మ వచ్చింది." కాపలావాడు నిర్లక్ష్యంగా వెటకారంగా అన్నాడు. "ఏం వస్తే" తన మనసు చివుక్కుమంది. అవమానం కలిగింది. అమ్మనయినా లోపలికి పోనివ్వడేమో అని భయం వేసింది. వాడు ఆమెకు ఏమీ అడ్డుచెప్పలేదు. కాని గౌరవం చూపలేదు. కొద్దిగా తలుపుతెరచి గదుముతూ "ఊ వెళ్లండి" అన్నాడు. ఆమె వెళ్ళింది. తను వెళ్ళలేదు. బాధతో అక్కడే ఉన్నాడు. గౌరవంలేని చోటుకు అమ్మను తీసుకువచ్చాడు. అందుకు మనస్సు బాధపడింది. అమ్మకు కూడా అక్కడ నచ్చలేదుకాబోలు, కాస్సేపట్లోనే బయటకు వచ్చింది. ఆ వేళ తనూ అక్కడ యింక ఉండలేదు. అమ్మతోనే ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఆమెను కావిలించుకుని కాస్త వూరటపొంది నిద్రపోయాడు.

రామనాథంగారు పలుకరించారు. "సభ ప్రారంభిద్దామా?"

రావుగారు ఉలిక్కి పడ్డారు ఆయన ముఖంలో ఉత్సాహం లేదు. గేటుదగ్గర పిల్లవాడి ముఖం గుర్తుకు వస్తోంది. రామనాథంతో అన్నారు. "చూడండి, ఈ సభకు ప్రవేశం ఉచితమేగదా? అందరూ రావచ్చుగదా?"

రామనాథం గొణిగాడు. "ఆ ఆ! ఇవి అందరికోసమే గదండి. అయినా మరీ అలగాజనం వస్తే మరీ గోలగా ఉంటుందని." రావుగారు నవ్వారు "పోనిద్దురూ. అలా మురికిగా ఉన్నవాళ్ళకి కాకపోతే, ఆరోగ్యాన్ని గురించి ముఖ్యంగా చెప్పవలసిందింకెవరికి? ఆ గేటు తెరిపించి అక్కడ పిల్లలనందరినీ లోపలికి పంపించండి." అలా అంటూ ఆయనే గేటువేపు నడిచాడు. కాపలావాడు గేటు తెరిచాడు. పిల్లలంతా ఉత్సాహంగా ముందుకు పరుగెత్తారు. ముందరవేపున ఉన్న చిన్నపిల్లవాడు ఉత్సాహంగా ఒక్క పరుగు పెట్టి ముందుకు పడ్డాడు. గబుక్కున లేచి కాళ్ళు దులుపుకుంటూ మళ్ళా పరుగు పెట్టాడు. గావుగారు నవ్వుకున్నారు. ఆ పిల్లవాడిని అంత సంతోషంగా చూడటం ఆయనకు ఎంతో ముచ్చటగా వుంది. ఆయన మనస్సులో ఎన్నాళ్ళగానో మూసుకున్న తలుపు అప్పుడు తెరుచుకుంది ●